క్లుప్తంగా

జాతరకు ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ, సీఐ

మధిర: ఈ నెల 18న మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు సోమవారం ఆలయంలో ధర్మకర్తల పాలకమండలి, అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆలయ ఈఓ జగన్‌మోహన్‌రావు, సీఐ ఒడ్డేపల్లి మురళి మాట్లాడుతూ.. శాంతిభద్రతలను కాపాడుతూ తిరునాళ్లకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం తగిన ఏర్పాట్లు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గంగా పార్వతీ సమేత మృత్యుంజయ స్వామి ఆలయంలో ఈ నెల 17 నుంచి 21 వరకు తిరునాళ్ల వైభవంగా జరుగుతాయని తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ చైర్మన్ వంకాయలపాటి నాగేశ్వరరావు, దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పృథ్వీ నాయక్, మున్సిపల్ ఇంజనీర్ నరేష్ రెడ్డి, లీడింగ్ ఫైర్‌మన్ వెంకటేశ్వరరావు, విద్యుత్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణోత్సవానికి ఆహ్వానం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఆలయ బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: మహాశివరాత్రి సందర్భంగా పెనుబల్లి మండలం నీలాద్రిలోని శ్రీశ్రీశ్రీ నీలాద్రీశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 18న జరిగే కల్యాణ మహోత్సవానికి హాజరుకావాలని కలెక్టర్‌ను వీ.పీగౌతమ్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆలయ చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సులోచన, అర్చకులు, సిబ్బంది సోమవారం ఖమ్మంలో కలెక్టర్‌ను కలిసి ఆహ్వానపత్రిక ఇచ్చాక సన్మానించారు.

కుష్ఠువ్యాధి నివారణకు కృషి చేయండి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జైపాల్

వైరా: కుష్ఠువ్యాధి రహిత జిల్లాగా తీర్చి దిద్దేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ అన్నారు. కుష్ఠువ్యాధి నివారణ పక్షోత్సవాల మగింపు సందర్భంగా సోమవారం నిర్వహించిన ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం రంగారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో పారా మెడికల్ ఆఫీసర్ వీఎస్ఆర్‌కే శాస్త్రి, వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ సీతారాములు, వైరా పీహెచ్‌సీ డీడీఓ ఉదయ లక్ష్మి, హెచ్ఎస్‌లు అనంతరావు, కనకతార తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలను నిరసిస్తూ ఆందోళన

కల్లూరు: వ్యవసాయానికి వచ్చే త్రీఫేజ్ విద్యుత్ సరఫరాలో విధిస్తున్న కోతలను నిరసిస్తూ సోమవారం మండలంలోని కల్లూరు సబ్‌స్టేషన్ ఎదుట కిసాన్‌సెల్ ఆధ్వర్యంలో రైతులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు శీలం బ్రహ్మారెడ్డి మాట్లాడారు. అనంతరం విద్యుత్‌శాఖ ఏఈ గణేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వనుకూరి నరసింహారెడ్డి, గోసు వెంకటకృష్ణ, ఎరమల నర్సిరెడ్డి, రైతులు కృష్ణారెడ్డి, ఖమ్మంపాటి వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, కృష్ణారెడ్డి, ఒబ్బిరెడ్డి రామకృష్ణారెడ్డి, తులిశమ్మ, శ్రీలత పాల్గొన్నారు.

18 నుంచి కబడ్డీ పోటీలు

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలో శ్రీదుర్గామల్లేశ్వరస్వామి తిరునాళ్ల సందర్భంగా ఈ నెల 18 నుంచి ఖమ్మం, ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లాల్ల స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. పోటీల్లో పాల్గొనేవారు ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5గంటల లోపు గూడూరు సత్యనారయణరెడ్డి 9908438525, గుర్రాల శివ 8463987625, శీలం కృష్ణారెడ్డి 9494602124, శాగం సురేందర్‌రెడ్డి 9963821682 నంబర్లను సంప్రదించాలని కోరారు.

విద్యార్థులు సమయాన్ని వృథా చేయొద్దు..

తల్లాడ: విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా.. ప్రణాళిక బద్ధంగా చదువుకోవాలని ఇంపాక్ట్ ఫౌండేషన్ మోటివేషన్ స్పీకర్ ఎండి. నవాబ్ పాషా అన్నారు. సోమవారం మండలంలోని తల్లాడ, అన్నారుగూడెం, కుర్నవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అందని ఆర్టీసీ సేవలు..

- జమలాపురం పుణ్యక్షేత్రానికి లేని ఆర్టీసీ సర్వీసులు
- కేవలం ఒక్క ట్రిప్పు మాత్రమే నడుపుతున్న వైనం..
- సాయంత్రం 5 దాటితే మధిర – ఎర్రుపాలెం బస్సులు నిల్..!
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు



జమలాపురం బస్టాండ్

ఎర్రుపాలెం: 'ప్రజల వద్దకే ఆర్టీసీ'పేరుతో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్న మధిర ఆర్టీసీ అధికారులకు ప్రయాణికులు చేస్తున్న విజ్ఞప్తులు పరిష్కారానికి నోచుకోవడం లేదు. పవిత్ర తెలంగాణా తిరుపతిగా ప్రసిద్ధి చెందిన జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయ పుణ్యక్షేత్రానికి.. ఉభయ తెలుగు రాష్ట్రాలైన తెలంగాణా, ఏపీల నుంచి ప్రతి రోజూ పెద్ద ఎత్తున భక్తులు వచ్చి శ్రీవారిని దర్శించుకుని పూజలు జరుపుకుంటున్నారు.. ఇలాంటి పుణ్యక్షేత్రానికి సైతం మధిర ఆర్టీసీ డిపో నుంచి కేవలం ఉదయం సమయంలో మధిర వయా జమలాపురం టూ మైలవరం సర్వీసు మాత్రమే మొక్కుబడిగా నడుపుతున్నారు. ఆ తర్వాత ఇక జమలాపురానికి మధిర నుంచి ఆర్టీసీ బస్సులు లేవు. ఈ సమస్యపై జిల్లా మంత్రి పువ్వాడ అజయ్, సీఎల్పీ నేత, స్థానిక ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్‌లకు భక్తులు పలుమార్లు మొరపెట్టుకున్నారు. అయినా ఆర్టీసీ అధికారులు కనికరించడం లేదు. ఆదాయం సరిపడా రావడం లేదనే సాకులతో సర్వీసులు నడపడం లేదు. ఆదాయ మార్గంగా చూడకుండా భక్తుల సౌకర్యార్థంగా పుణ్యక్షేత్రానికి బస్సులు నడపాల్సి ఉంది. లేకపోతే ఆరూట్‌లో ప్రయాణికులకు మరింతగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా అవగాహన కల్పించాలి. అంతేకాని ఆదాయం లేదనే ఉద్దేశ్యంతో ఆ రూట్‌లో బస్సులు నడపకపోతే ఎట్లా అని భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఏపీ నుంచి అవసరమైన మేరకు బస్సులను అక్కడి డిపోలు నడుపుతున్నప్పటికీ తెలంగాణా ఆర్టీసీ జమలాపురం పుణ్యక్షేత్రాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదు. అందని ఆర్టీసీ సేవలతో ప్రయాణికులు అవస్థల పడుతున్నారు.

ఐదు దాటితే ఎర్రుపాలెం రూట్‌కు బస్సులు నిల్..!

మధిర బస్టాండ్‌లో సాయంత్రం 5గంటల దాటాక మధిర వయా ఎర్రుపాలెం టూ విజయవాడ వెళ్లడానికి కనీసం ఒక్క బస్సు సర్వీసు లేదు. ఐదు తర్వాత ఇక ప్రయాణికులకు ఆటో ప్రయాణమే గతిగా మారింది. దీంతో ఆర్టీసీ తీరుపై ప్రయాణికులు ఆగ్రహం వెలుబుచ్చుతున్నారు.70 కి.మీ మేరకున్న ఆదాయ వనరుగా విజయవాడ రూట్‌కు అంతకు మునుపున్న బస్సులు రద్దు చేశారు. ఆదాయం వచ్చే రూట్‌కు కూడా బస్సులు ఎందుకు కొనసాగించడం లేదని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఎర్రుపాలెం నుంచి మధిరకు వెళ్లాలంటే ఉదయం 9గంటల వరకు ఒక్క బస్సు కూడా లేదు. వ్యయ ప్రయాసలతో ఆటోల్లో వెళ్లాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు సమీక్షించి సత్వర చర్యలు తీసుకోవావాలి.



జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయం

పుణ్యక్షేత్రానికి బస్సులు నడపాలి..



మధిర, ఖమ్మం డిపోల నుంచి ప్రతి రోజు జమలాపురం పుణ్యక్షేత్రానికి బస్సు సర్వీసులు నడపాలి. మధిర డిపో అధికారులు కేవలం ఒక్క ట్రిప్పు మాత్రమే సర్వీసు కొనసాగిస్తున్నారు. దీంతో ఆలయానికి ఆటోల్లోనే రావాల్సి వస్తుంది. ప్రతి రోజు ఏపీకి చెందిన గన్నవరం, ఇబ్రహీంపట్నం, విజయవాడ డిపోల నుంచి బస్సు సర్వీసులు నడుపుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– ఉయ్యూరు మల్లిక, ఉప సర్పంచ్, జమలాపురం

మధిరకు ఉదయం 9 వరకు ఒక్క బస్సు లేదు..



ఎర్రుపాలెం మండలకేంద్రం నుంచి మధిరకు వెళ్లడానికి ఉదయం 9గంటల వరకు ఒక్క ఆర్టీసీ బస్సు లేదు. దీంతో ఆటోలో అధిక చార్జీ చెల్లించి భద్రత లేని ప్రయాణం సాగించాల్సి వస్తుంది. ప్రజల వద్దకే ఆర్టీసీ సదస్సులు పెడుతున్న అధికారులకు సమస్యను వివరించాం. వీలైనంత వరకు మధిర టూ విజయవాడ ప్రధాన రూట్‌కు సరిపడా బస్సులు నడపాలి.

– కడియం శ్రీనివాసరావు, ఎర్రుపాలెం

సమీక్షించి చర్యలు తీసుకుంటాం...



జమలాపురం పుణ్యక్షేత్రానికి బస్సులు నడిపితే నిర్వహణ ఖర్చులు కూడా రావడం లేదు. ప్రయాణీకులు ఆదరణ తగ్గడంతో సరిపడా బస్సు సర్వీసులు వేయలేకపోతున్నాం.

మధిర, వయా ఎర్రుపాలెం టూ విజయవాడ ప్రధాన రూట్‌కు బస్సు సర్వీసులు నడిపేందుకు చర్యలు తీసుకుంటాం. ఇటీవల పలువురు బస్సు డ్రైవర్లు బదీలయ్యారు. డ్రైవర్లు రాగానే సర్వీసులు పునరుద్ధరిస్తాం.

– దేవదానం, ఆర్టీసీ డిపో మేనేజర్, మధిర

ఆత్మీయ సమ్మేళనం విజయవంతానికి ర్యాలీలు



ఏన్కూరులో మాట్లాడుతున్న విజయబాయి

వైరా/ఏన్కూరు/కారేపల్లి: వైరా అయ్యప్ప స్వామి దేవాలయం సమీపాన బుధవారం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యాన నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం ఆయన వర్గీయులు వైరాలో భారీ మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, నాయకురాలు బానోత్ విజయాబాయి మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళనానికి ఐదు మండలాల నుంచి కార్యకర్తలు భారీగా తరలి రావాలన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ గుమ్మా రోశయ్యతో పాటు మిట్టపల్లి నాగేశ్వరరావు, షేక్ రహీం, చింతనిప్పు సుధాకర్, పోలా శ్రీనివాసరావు, కాంపాటి శేషగిరి, జాలాది రామకృష్ణ, ఐలూరి మోహనరెడ్డి, దార్ల శేఖర్, సంగెపు వెంకన్న పాల్గొన్నారు. ఇక ఏన్కూరులో ఏర్పాటుచేసిన సమావేశంలో విజయాబాయి మాట్లాడుతూ సమ్మేళనానికి అన్ని గ్రామాల నుంచి తరలిరావాలని కోరారు. నాయకులు స్వర్ణ ప్రహ్లాదరావు, నల్లమల శివకుమార్, వాసిరెడ్డి నాగేశ్వరావు, రుద్రాసి నాగేశ్వరావు, తాటి యుగేందర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, కారేపల్లిలో కూడా బైక్ ర్యాలీ నిర్వహించగా ఇమ్మడి తిరుపతిరావు, అజ్మీరా నరేష్, మనిగొండ నాగేశ్వరరావు, మల్లెల నాగేశ్వరరావు తదితరులు మాట్లాడారు.

జేవీఆర్ ఓసీలో డైరెక్టర్ పర్యటన



సీహెచ్‌పీలో యంత్రాలను పరిశీలిస్తున్న డైరెక్టర్ సూర్యనారాయణరావు, అధికారులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి జేవీఆర్ ఓసీ, సీహెచ్‌పీ పనితీరును సింగరేణి డైరెక్టర్ డి.సూర్యనారాయణరావు సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన బొగ్గు ఉత్పత్తి, రవాణాకు అంతరాయం కలగకుండా సీహెచ్‌పీని పూర్తి సామర్థ్యంతో ఉపయోగించుకోవాలని సూచించారు. అధికారులు జక్కం రమేష్, స్వామినాయుడు, నర్సింహారావు, సూర్యనారాయణ, లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

తల్లాడ: మండలంలోని బిల్లుపాడు గ్రామంలో సోమవారం సీసీ రోడ్డు నిర్మాణానికి తల్లాడ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. రూ.5 లక్షల వ్యయంతో ఈ రోడ్డును నిర్మించనున్నట్లు ఎంపీపీ తెలిపారు. మండలంలోని నూతనకల్ గ్రామానికి చెందిన పమ్మి మురళి రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా సాయంగా ఎమ్మెల్యే సండ్ర అందించిన రూ.50 వేల చెక్కును ఎంపీపీ మండల పరిషత్‌కార్యాలయంలో అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవీంద్రరెడ్డి, డి.వెంకట్‌లాల్, ఆర్అండ్‌బీ డీఈ రాంబాబు, ఎంపీటీసీ రుద్రాక్ష బ్రహ్మం, సొసైటీ చైర్మన్ వీరమోహన్‌రెడ్డి, డి.భద్రరాజు, నరసింహారావు, వీరభద్రరావు, కృష్ణార్జున్‌రావు, ప్రసాద్, నాగేశ్వరరావు, వెంకటి, రఘు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

చింతకాని: మండలంలోని ఎమ్మార్పీఎస్ నాయకులను పోలీసులు సోమవారం ముందస్తు అరెస్ట్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు విజయవాడ జాతీయ రహదారి నిర్బంధం కార్యక్రమానికి వెళ్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులను ముందస్తు అరెస్ట్ చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్ట్ చేసిన వారిలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ గుండ్ల రాంబాబు, నాయకులు యాకోబు, పుల్లారావు తదితరులు ఉన్నారు.

కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే సండ్ర, నాయకులు

కల్లూరు రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఆయకట్టు రహదారుల మంజూరుకు ఐటీ పరిశ్రమల శాఖామంత్రి కేటీఆర్‌ను ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆధ్వర్యంలో కలిసి సమస్యను మంత్రికి వివరించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు పాలెపురామారావు, బత్తుల పల్లి సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, హనిమిరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లింగమంతుల జాతర



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కోదాడ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

ముదిగొండ: ముదిగొండ పారిశ్రామిక ప్రాంతంలో లింగమంతుడి ఆలయం వద్ద సోమవారం జాతర ఘనంగా నిర్వహించారు. ముదిగొండ, రాఘవాపురం గ్రామాలనుంచి మహిళలు కోలాటంతో లింగమంతుల ఆలయానికి చేరుకుని పూజలు చేసి బోనాలను సమర్పించారు. కోదాడ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్, ఖమ్మం నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు పగడాల నాగరాజు, ఖమ్మం కార్పొరేటర్ కూరాకుల వలరాజు, యాదవ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

చింతకాని: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గ్రామసర్పంచ్ తిరుపతి కొండలరావు తెలిపారు. మండలంలోని మత్కేపల్లి గ్రామంలో హైద్రాబాద్ గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్, గ్రేస్ సర్వీస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని గ్రామసర్పంచ్ ప్రారంభించి మాట్లాడారు. ఈ శిబిరాన్ని నిర్వహించి రోగులకు వైద్య సేవలు అందిస్తున్న గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్, గ్రేస్ సర్వీస్ సొసైటీలను అభినందించారు. వైద్య శిబిరంలో రోగులకు కేన్సర్‌తో పాటు పలు రకాల వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు తిరుపతి భాగ్యలక్ష్మి, వైద్యులు గోపాలకృష్ణ, సంజీవరావు, గ్రామ పెద్దలు కోటేశ్వరరావు, అంజయ్య, రామ్మూర్తి, పాస్టర్లు ఎర్నెస్ట్ పాల్, విజయభాస్కర్, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం



సత్తుపల్లిటౌన్: కంటి వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సీతారాం

మధిర/సత్తుపల్లిటౌన్/తల్లాడ/వేంసూరు/కల్లూరు రూరల్: కంటి వెలుగు శిబిరాలను పకడ్బందీగా నిర్వహించాలని సిద్దినేనిగూడెం సర్పంచ్ మేమిరెడ్డి పెదనాగిరెడ్డి, సత్తుపల్లి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ టి.సీతారాం, తల్లాడ సర్పంచ్ పాటేటి సంధ్యారాణి, చౌడవరం సర్పంచ్ గాయం సద్గుణవతి, కప్పలబంధం ఎంపిపి బీరవెల్లి రఘు అన్నారు. ఆయా మండలాల్లోని గ్రామాల్లో కంటి వెలుగు శిబిరాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడాతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మి ప్రసన్న, ఏఎన్ఎంలు మరియమ్మ, రాజ్యలక్ష్మి, సత్యావతి, డాక్టర్ అవినాష్, సూపర్‌వైజర్లు ప్రమీలారాణి, నర్సింహారావు, అన్నమ్మ, విజయకుమారి, ఎంపీడీఓ రవీంద్రరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ భద్రరాజు, ఎంపీటీసీలు రఘుపతిరెడ్డి, తిరుమలా దేవి, వైద్యాధికారి రత్న మనోహర్, చల్లా నాగులు, ఎంపీపీ వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సుమలత, ఎంపీటీసీ కృష్ణవేణి, ఏఎన్ఎం రమాదేవి, పల్లెవాడ మాజీ సర్పంచ్ రాంబాబు, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ నవ్యకాంత్, తబస్సుమ్, రామారావు, వాణి, రాజేష్, మాధవరెడ్డి, నవీన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రాము, షమీనా, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమన్వయంతో జాతర విజయవంతం



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాములునాయక్

కారేపల్లి: మహాశివరాత్రి సందర్భంగా కారేపల్లి మండలం పోలంపల్లి సమీపాన కోటిలింగాలలో జరిగే జాతరను అన్నిశాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ సూచించారు. మండలం ఉసిరికాయలపల్లిలో సోమవారం ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యం, పార్కింగ్ ఇతర ఏర్పాట్లు పకడ్బందీగా చేయడంతో పాటు కోటిలింగాల వాగు వద్ద ప్రమాదాలు జరగకుండా గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. కోటిలింగాల, కోటమైసమ్మ ఆలయాల చైర్మన్లు అలెం వెంకటేశ్వర్లు, డాక్టర్ పర్సా పట్టాభి రామారావు, ఎంపీపీ మాలోత్ శకుంతల, సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉమాశంకర్, భన్సీలాల్, పీఆర్ డీఈ వెంకటరెడ్డి, తహల్దార్ తూమటి శ్రీనివాస్, ఎంపీడీఓ చంద్రశేఖర్, సీఐ ఆరిఫ్ అలీఖాన్, ఎస్ఐ పి.రామారావు, ఎంపీఓ రాజారావు పాల్గొన్నారు.

లాటరీ ద్వారా లబ్ధిదారుల ఎంపిక



'డబుల్' ఇళ్లకు లాటరీ ద్వారా ఎంపిక చేస్తున్న దృశ్యం

కల్లూరు రూరల్: పట్టణంలో నిర్మించిన 96 డబుల్ బెడ్ రూం ఇళ్లకు లాటరీ ద్వారా సోమవారం గ్రామ పంచాయితీ ఆవరణలో ప్రజల సమక్షంలో అధికారులు లాటరీ నిర్వహించి, లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ మేరకు 1,100 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో పేదలు అత్యంత నిరుపేదలను సర్వే నిర్వహించి 231 మందికి అర్హులుగా తేల్చారు. ఈ మేరకు రిజర్వేషన్ ప్రకారం లాటరీ నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. అనంతరం లాటరీలో పేర్లు రానివారు జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఎస్సై తమ సిబ్బందితో వచ్చి వారితో మాట్లాడి రాస్తారోకో విరమింపజేశారు. లాటరీ రద్దు చేసి మళ్లీ లాటరీ నిర్వహించాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, స్పెషలాఫీసర్ సునిత, కల్లూరు సర్పంచ్ నీరజ, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఇస్మాయిల్, డాక్టర్ లక్కినేని రఘు, ఎంపీటీసీ సభ్యులు కిరణ్‌కుమార్, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీదే అధికారం



ముదిగొండ: మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

ఎర్రుపాలెం/ముదిగొండ: రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ జిల్లా కార్యదర్శి చిలివేరు సాంబశివరావు, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నూతక్కి నర్సింహారావు, మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావులు, బీజేపి కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డిలు అన్నారు. మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలో, మాదారంలో సోమవారం ప్రజా గోస – బీజేపీ భరోసా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాడు ధనిక తెలంగాణ ఉండగా, అప్పుల రాష్ట్రంగా మార్చారని విమర్శించారు. రాష్ట్రంలో నిరంకుశ పాలన నుంచి ప్రజలకు విముక్తి కలగాలని కోరారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు నాయకులు నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, చంద్రమౌళేశ్వరరావు, రమేష్, ధర్మారావు, మోహన్‌రావు, రామకృష్ణ, రమేష్, ప్రవీణ్, సత్యనారాయణరెడ్డి, విజయ్, మండల అధ్యక్షుడు సుధాకర్, పాలేరు, మధిర అసెంబ్లీ కన్వీనర్ నాగేశ్వరరావు, సంతోషరెడ్డి, బూత్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, సంజీవరెడ్డి, విజయరాజు, హనిమి రెడ్డి, నాగిరెడ్డి, సైదారావు, సాలయ్య, పాలేరు కన్వీనర్ సంతోష్‌రెడ్డి తదితరులున్నా పాల్గొన్నారు.

సరోజినీనాయుడు స్ఫూర్తితో స్వావలంబన



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

సత్తుపల్లి: భారత కోకిల సరోజినీనాయుడు స్ఫూర్తితో విద్యార్థినులు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బి.మధుసూదన్‌రాజు సూచించారు. జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను స్థానిక పాతసెంటర్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం నిర్వహించగా, ఉత్తమ ఉపాధ్యాయులైన రాపర్తి నాగమణి, తోటచర్ల జయశ్రీని సత్కరించారు. పాఠశాల హెచ్ఎం చిత్తలూరి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బి.మధుసూదన్‌రాజు, కాంప్లెక్స్ హెచ్ఎం రాజేశ్వరరావు మాట్లాడారు. అనంతరం ప్రాజెక్ట్ వర్క్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లాల్ అహ్మద్, పెద్దబోయిన పవన్, పంతంగి నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజూ కొనసాగిన ధర్నా

కారేపల్లి: సింగరేణి మండలం మాధారంలోని విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ డోలమైట్ మైన్స్ ఎదుట కార్మికులు చేపట్టిన ధర్నా మూడో రోజైన సోమవారం కొనసాగింది. ఈసందర్భంగా వివిధ పార్టీలు, సంఘాల నాయకులు వై.ప్రకాష్, జి.నరసింహరావు మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు బాదావత్ వీరూ, ఖైరుద్దీన్, షేక్ ఇబ్రహీం, జి.రవికుమార్, జి.లక్ష్మీనారాయణ, కళావతి, బి.వీరన్న, ఎస్.కే.ఇబ్రహీం, ఎస్.ప్రసాద్, నాగులుమీరా పాల్గొన్నారు.

ఒక సారి అవకాశం ఇవ్వండి

కల్లూరు రూరల్: కాంగ్రెస్ పార్టీకి ఒక సారి అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంభాని చంద్రశేఖర్ అన్నారు. సోమవారం హాథ్ సే హాథ్ జోడో యాత్ర కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో జెండా ఆవిష్కరించి పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు బైరెడ్డి మనోహర్‌రెడ్డి, నాయకులు కిరణ్, ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, గోపాల స్వామి, కృష్ణారెడ్డి, శర్మ, పుల్లారావు, కృష్ణ, జనార్దన్ పాల్గొన్నారు.

నిరుపేద మహిళకు చేయూత

ముదిగొండ: మండలంలోని మేడేపల్లికి చెందిన నిరుపేద మహిళ పారేపల్లి స్వరూపరాణికి జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పరిశ సీతారత్నం ట్రస్టు ద్వారా ట్రస్టు చైర్మన్ పరిశ పుల్లయ్య వెట్‌గ్రైండర్‌ను సోమవారం ఆమెకు అందించారు. కుటుంబంలో భర్త మరణించడంతో పాటు కూతురు మానసిక వికలాంగురాలుగా ఉండడంతో చలించిన ట్రస్టు చైర్మన్ ఆమెకు అందించారు. కార్యక్రమంలో ట్రస్టు సలహాదారు నరసింహారావు, నాగేశ్వరరావు, హరినాద్ బాబు, సత్యావతి, జయరాంలు పాల్గొన్నారు.

సేవాలాల్ మహారాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న దశరథ్ నాయక్

ఏన్కూరు: బంజారాలందరూ తమ సంస్కృతిని కాపాడుకుంటూ సేవాలల్ మహారాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి. లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గుగులోతు కృష్ణనాయక్, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ధర్మసోత్ దశరద్ నాయక్‌లు కోరారు. మండలంలోని హిమామ్‌నగర్‌లో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలన్నారు. సేవాలాల్ జయంతిని ఫిబ్రవరి 15న అధికారికంగా జరుపుతుంది కాబట్టి ప్రతి మండలానికి రూ.1కోటి నిధులు సమకూర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులు భూక్య భీముడు, భూక్యకిషన్, గుగులోతు లక్ష్మణ్ నాయక్, భూక్యా శ్రీను నాయక్, లకావత్ నవీన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైరాలో జర్నలిస్టుల రాస్తారోకో



జర్నలిస్టులతో మాట్లాడుతున్న తహసీల్దార్ అరుణ

వైరా: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గత నాలుగు రోజులుగా వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట రిలే దీక్షలు నిర్వహిస్తున్న వైరా జర్నలిస్టులు సోమవారం వైరాలో రాస్తారోకో నిర్వహించారు. సుమారు గంటకు పైగా వాహనాలు నిలిచి పోయాయి. వీరి ఆందోళనకు, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, బీజేపీ నాయకులు సంఘీభావం ప్రకటించి రాస్తారోకోలో పాల్గొన్నారు. తహసీల్దార్ నారపోగు అరుణ సంఘటనా స్థలానికి చేరుకుని జర్నలిస్టులతో మాట్లాడారు. తమకు ఉన్నతాధికారుల నుంచి హామీ వచ్చే వరకు ఆందోళన విరమించమని జర్నలిస్టులు భీష్మించడంతో ఆమె ఆర్డీఓ మధుసూధనరావుతో మాట్లాడారు. ఒక్కరోజు సమయం ఇస్తే సమస్య పరిష్కరించడానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇవ్వడంతో జర్నలిస్టులు ఆందోళన విరమించారు. జర్నలిస్టుల ఆందోళనకు డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, వైఎస్ఆర్‌టీపీ జిల్లా అధ్యక్షుడు లక్కినేని సుధీర్‌బాబు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల ప్రసాదరావు, సీపీఐ జిల్లా నాయకుడు యర్రా బాబు, టీయూడబ్ల్యూజే ఐజేయు ప్రతినిధులు రాంనారాయణ, ఏనుగు వెంకటేశ్వరరావు, వనం వెంకటేశ్వర్లు, సర్వనేని వెంకటరావు మద్దతు తెలిపారు. ఈ ఆందోళనలో జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.